విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, గురువారం 12, జూన్ 2025

రాయలసీమ రైతులను కూటమి ప్రభుత్వం అగాధంలో పడేసింది..

- అన్నదాత సుఖీభవ అమలు చేయకపోతే సీఎం, మంత్రులను అడ్డుకుంటాం
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాయలసీమ రైతులను కూటమి ప్రభుత్వం ఆగాథంలో పడేసిందని, ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను సంవత్సర పాలన పూర్తి అయినప్పటికీ నెరవేర్చక పోవడం సిగ్గు చేటని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జునలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన అన్నదాత సుఖీభవ అమలు చేయకపోతే సీఎం, మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతులను మోసం చేసే ఏ ప్రభుత్వమైనా రైతు ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంబాయి లక్షల మంది రైతులు కన్నీరుకి గురైనారని నకిలీ విత్తనాలపై దృష్టి పెట్టాలని వారు కోరారు. లైసెన్స్ గల ఎరువు దుఖానుదారులు ఏపీలో డంపింగ్ చేస్తున్నా అడ్డుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది అని ఆరోపించారు. రైతాంగ ప్రయోజనాల పాటుపడితే కృష్ణ, గోదావరి, పెన్నా నదిని అనుసంధానం చేసి నిరూపించాలన్నారు. గతంలో ఉన్న డిపిఆర్ ను మార్చేసి.. గ్రావిటీని ఉన్న ప్రయోజనాలను కూలదొల్చారు అన్నారు. రైతులపై ప్రభుత్వానికి ప్రేమ ఉంటే అఖిపక్షంతో సమావేశమై.. సమస్యల పరిష్కారానికి అడుగులు వేయాలని కోరారు. ధరల స్థిరీకరణ లేక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక కన్నీరు పెడుతున్నారన్నారు. టమోటా, మామిడికాయలు , ఎర్రగడ్డలు ధరలు లేక రోడ్డుపై పడేసిన పరిస్థితి నెలకొన్నది. మార్కెటింగ్, ధరలపై స్థిరీకరణ, నిరంతర అన్వేషణ , శీతల గిడ్డంగులు ఏర్పాటుచేసి రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండు చేశారు. 3లక్షల ఎకరాలకు సాగు నీరును ఇవ్వలేక.. పంటలు నీరుగారి పోయిందని.. ప్రభుత్వ నిర్లక్ష్యం, పనితీరు ఇందుకు నిదర్శనం అన్నారు. హెచ్ ఎల్ సి కెనాల్ పనులు లైనింగ్ చేయకపోవడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు రాక అనంత రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉన్నారన్నారు. మోపిడి దగ్గర పీఏబీఆర్ కాలవ ధ్వంసం అయిపోయిన మీరు రాని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. హంద్రీనీవా, హెచ్ ఎల్ సి కాలువలను పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని రైతాంగ పోరాటంకు దిగుతామన్నారు.

ప్రతి రైతుకు అండగా ఉంటాం..

'ఏరువాక పౌర్ణమి" సందర్భంగా దుక్కి దున్ని విత్తనం వేసిన కలెక్టర్

విశాలాంధ్ర-కూడేరు : ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు పంటలను సాగు చేసే కార్యక్రమం మొదలుపెట్టారని, ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆకాంక్షించారు. బుధవారం కూడేరు మండలం కొర్రకోడు గ్రామపరిధిలో "ఏరువాక పౌర్ణమి" సందర్భంగా వ్యవసాయ పొలంలో ఎద్దులతో దుక్కిదున్ని విత్తనం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి జేష్ఠ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా వ్యవహరిస్తున్నారని, ఈ రోజున వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు రైతులందరూ తమ పొలాల్లో భూమి పూజ చేస్తారన్నారు. సంస్కృతిలో భాగంగా పూజ చేసి మంచి వర్షాలు రావాలని.. మంచి పంటలు పండాలని వ్యవసాయానికి వాడే పరికరాలను, పశువులను శుభ్రం చేసి పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ప్రభుత్వం రైతుల కోసం పనిచేస్తుందని, ప్రతి జిల్లాలోనూ ఖరీఫ్ సందర్భంగా ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే వేరుశనగ, ఇతర విత్తనాల పంపిణీ మొదలైందని, జిల్లాకు కేటాయించిన విత్తన పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేశామని, 2025-26వ సంవత్సరా నికి సంబంధించి లక్ష్యాన్ని తయారుచేసుకున్నా మన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పలు రకాల రైతుల సమస్యలు పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 40 శాతం వర్షం అధికంగా వచ్చే అవకాశం ఉందని, ఈ సంవత్సరం సకాలంలో వర్షం రావాలని కోరుకుంటు న్నామన్నారు. గత ఏడాది కూడా 40 శాతం అధికంగా వర్షం కురవడం జరిగిందని, సకాలంలో కురువకపోయినా వర్షం వల్ల భూగర్భజలంపెరిగిందన్నారు. ప్రతి రైతుకి ప్రభుత్వం నుంచి అండగా ఉంటామని, రైతు సేవా కేంద్రాల నుంచి రైతులకు అవసరమైనవి. అందజేస్తామన్నారు. చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహంగాను రైతులకు మినీ కిట్స్ అందిస్తున్నామని, పలువురు రైతులకు రాగి, కంది మినీ కిట్స్ ను జిల్లా కలెక్టర్ అందజేశారు. అనంతరం రైతులకు వేరుశనగ విత్తనాలను, సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్థక శాఖ జెడి వెంకటస్వామి, డిసిఓ అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, కార్డు ఎన్జీవో నిర్మలారెడ్డి, ఏవో విజయ్ కుమార్, ఎంపీడీవో కుల్లాయి స్వామి, హౌసింగ్ ఏఈ అశోక్, ఏపీవో పోలేరయ్య, ఏవోలు బాల నాయక్, సోమశేఖర్, రాకేష్, ఆయా శాఖల అధికారులు, ఎంపిఈఓ పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల పొట్ట కొడుతున్న మోడీ సర్కార్..

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్

విశాలాంధ్ర-శింగనమల : ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించక ఆకలి కేకలతో అలమటిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10వారాలుగా పనిచేసిన కూలీలకు ఉపాధి బిల్లులు రాలేదని ఉపాధి కూలీలు ఏమి తిని పనిచేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టించి పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ బిల్లులను తక్షణమే కూలీల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో వ్యవసాయ పనులు లేక బిల్లులు వస్తాయని ఉపాధి హామీ పనులకువెళ్లి కష్టపడి పని చేస్తే గత10 వారాలుగా బిల్లులు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కష్టపడి పనిచేస్తున్నకూలీలకుగిట్టు బాటు అయ్యేకూలిని అందించాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి, రోజు రూ.700లకు కూలి పెంచి, పనిముట్లు గడార్లు, గడ్డపారలు, మట్టిమోసే తట్టలు ప్రతి ఒక్క కూలికి అందించాలన్నారు.

టార్పాలిన్ పట్టలు, మజ్జిగ సౌకర్యం, మెడికల్ కిట్లు, కూలీలు పనిచేసేచోట అందుబాటులో ఉంచాలని ,డ్రైలాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కలు నాటిన వారికి కూడ బిల్లురాక ఇబ్బందులుపడుతున్నారని, బిల్లులు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కూలీలకు బిల్లుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోందని, అధికారులు చొరవ తీసుకొని ఉపాధి కార్మికులకు తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన నిలిచి ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్ పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి సాగును ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్

విశాలాంధ్ర-యాడికి: ఏరువాక పౌర్ణమి వ్యవసాయ సాగును రైతులతో కలిసి ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ డిమాండ్ చేశారు. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామ రైతులతో కలిసి ఏరువాక పౌర్ణమి వ్యవసాయ సాగును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక సాగు నుండి, పంటలు పండి, రైతులు గిట్టుబాటు ధరలతో సుఖసంతోషాలుతో ఉండాలని, రైతులు మరింత ఉత్సాహంగా వ్యవసాయం చేయాలంటే ఎద్దులను, ట్రాక్టర్లును, సబ్సిడీతో నాట్లు, కోతల నూర్పుడి యంత్రాలు, మైక్రో ఇరిగేషన్ పరికరాల కోసం 75 శాతం రాయితీని రైతులకు అందించాలన్నారు. రైతులకు అవసరమైన పెట్రోల్ డీజిల్ 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని, రైతులు కౌలు రైతులకు వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు రుణం అందించాలన్నారు. అదేవిధంగా రూ.5 లక్షల వరకు పావలా వడ్డీ పై రుణం రైతులకు అందించి, ఆర్.బిఐ నిబంధన ప్రకారం ఒక లక్ష 60 వేల రూపాయలు కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సూక్ష్మ పోషకాలు 90 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలు అమ్మే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని పాడిపశువులకు గొర్రెలకు మేకలు కూడా విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆదినారాయణ యాదవ్ ఆదినారాయణ, పెద్దవడుగూరు సీపీఐ మండల సహాయ కార్యదర్శి, పోలా రంగస్వామి, నారాయణస్వామి, రామాంజనేయులు, అల్లావలి పెద్దన్న శరత్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే గోకులం షెడ్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంతకల్లు : రైతుల శ్రేయసు కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం చంద్రబాబు నాయుడు గోకులం పశువుల షెడ్లు మొదలుపెట్టారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని దోసలోడికి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం పశువుల షెడ్లను గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులకు ప్రభుత్వం అండగా ఉండన్నారు. దోసలుడికి గ్రామంలో రూ.4.60 లక్షల వ్యయంతో రెండు షెడ్లను నిర్మించడం జరిగింది. తదుపరి విడతలో మరి కొందరు అర్హులైన రైతన్నలకు షెడ్లు నిర్మించుకునేదానికి అవకాశం కల్పిస్తామని అన్నారు. అలాగే సిసి రోడ్లకు కోటి 36 లక్షల మంజూరు కాగా భూమి పూజ చేశారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనందు, మస్తానప్ప, లాయర్ కృష్ణారెడ్డి, గుండాల తండా సర్పంచ్, డిస్టిక్ గిరిజన వెల్ఫేర్ ఆఫీసర్ టి.రామాంజనేయులు, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసులు, డీఎల్‌డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ రమాదేవి, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

దుకాణాలపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-కణేకల్లు : కనేకల్ క్రాస్‌లో బుధవారం దుకాణాల్లో బుధవారం అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బెంగళూర్ బేకరీలో 600 ఎంఎల్ మిరిండా కూల్ డ్రింక్ రూ.40 ఉండగా రూ.45లకు, సన్ ఫీస్ట్ బిస్కట్ ప్యాకెట్ ధర రూ.35 ఒకటి కొంటే ఒకటి ఉచితం కానీ బేకరి వారు రూ.50లకు విక్రయించారు. ఇది లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం నేరం కావడంతో బేకరి యాజమాన్యంపై కేసు నమోదు చేసి రూ.25 వేలు జరిమానా కట్టించారు.

దోమల నివారణ మందు పిచికారి

విశాలాంధ్ర-కూడేరు: స్థానిక కేజీబీవీ రెసిడెన్సియల్ స్కూల్, గర్నమెంట్ యస్ సి బాయ్స్ హాస్టల్, బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ లో మలేరియా దోమల నివారణ మందును బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడేరు వైద్యధికారి అదేశాల మేరకు మాలతీయన్ పిచికారీ చేశారు. హాస్టల్ విద్యార్థులకు ఇబ్బంది కలుగరాదని రోగాలు రాకూడని ముందస్తుగా పరిశుభ్రత చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్, మద్దయ్య, సూపర్వైజర్స్ నూర్బాషా, శ్రీధరమూర్తి, రవీంద్ర హెల్త్ అసిస్టెంట్స్ శివప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన డివిజనల్ పంచాయతీ అధికారి

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని చందన రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. తడి పొడి చెత్త నుండి వేరు చేసే విధానాన్ని పరిశీలించి వర్మి కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు అనంతరం మూలనపడ్డ పంచాయతీ చెత్తను తీసుకెళ్లే రిక్షాలను పరిశీలించి, పనికివచ్చే వాటిని రిపేరు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, ఎంపీడీవో వీర్రాజు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర,, పంచా యతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని శ్రీచైతన్య విద్యా సంస్థలను సీజ్ చేయాలి

ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా మాయమాటలతో విద్యా దోపిడీ చేస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్బి, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ఏ, ఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ... జిల్లాలో శ్రీ చైతన్య విద్యా సంస్థలు జిల్లా విద్యాశాఖ అధికారులకు దొంగ పత్రాలు ఇచ్చి అనుమతులు తీసుకొని విద్యాసంస్థలు నడుపుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఏవైతే అనుమతులు లేకుండా చైతన్య విద్యాసంస్థలు నడుపుతు న్నారో నాలుగు బ్రాంచ్లను సీజ్ చేస్తామని డీఈ ఓ తెలిపారని పేర్కొన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలు నగరంలో కో ఎడ్యుకేషన్‌కు కొన్ని బ్రాంచ్లు పర్మిషన్ తెచ్చుకొని కేవలం అమ్మాయిలతో నడుపుతూ మరికొన్ని బ్రాంచ్‌లకు అమ్మాయి లకు పర్మిషన్ తెచ్చుకొని కో ఎడ్యుకేషన్ నడుపుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను ఆన్లైన్ ద్వారా ఇళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. రేపటి నుంచి విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు నగరంలో ఉన్న చైతన్య విద్యాసంస్థలలో వెళ్లి విద్యార్థుల దగ్గర ఉన్న పుస్తకాలు వారి సంస్థ పేరుతో ముద్రించినవా కాదా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చైతన్య విద్యాసంస్థలకు ఒక్క బ్రాంచుకు కూడా మైదానం లేదని.. చదువు పేరుతో విద్యార్థులను యంత్రాల్లాగా తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులపైన రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు, జిల్లా నాయకులు ఆంజనే యులు, వెంకట్‌నాయక్, మంజు, రమణయ్య, నాని, సమీర్, బాబ్జాన్, మనోహర్, యశ్వంత్, కార్తీక్, జయ, తరుణ్, అక్బర్, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి, విజయ్, సోము, అజయ్, ఏఐఎస్బి నాయకులు విజయ్ పాల్గొన్నారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగమే కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాజకీయ కక్ష సాధింపులో భాగమే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావును ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి అన్నారు. బుధవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొమ్మినేని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సాక్షి మీడియా వేదికగా కేఎస్ఆర్ లైవ్ షో అనే చర్చా కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను కొమ్మినేని వెలుగులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. చర్చా కార్యక్రమంలో కృష్ణంరాజు అనే రాజకీయ విశ్లేషకుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే, కొమ్మినేని అరెస్ట్ చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. సాక్షి టీవీ చర్చ వేదికల్లో సదరు వ్యక్తి చేసిన వ్యాఖ్యలను సాక్షి టీవీ, వైసీపీ ఖండించడమే కాకుండా తీవ్ర అభ్యంతరం తెలిపిందని గుర్తు చేశారు. కానీ చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం ఈ ఘటనను వాడుకుంటు న్నారని మండిపడ్డారు. కూటమి సర్కార్ సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అందుకనే సాక్షి కార్యాలయాలపై దాడులు చేస్తూ ఆస్తులను ధ్వంసం చేస్తూ విధ్వంసకాండ చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో పత్రికా స్వేచ్ఛ లేదా? మీడియా గొంతు నొక్కటమే చంద్రబాబు లక్ష్యమా? అని నిలదీశారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు, కొమ్మినేని విషయంలో ఆగమేఘాలపై స్పందించడం కుట్రలో భాగమే అన్నారు. రాష్ట్రంలో ప్రజలు అన్ని విషయాలు నిశితంగా గమనిస్తున్నారని భవిష్యత్తులో కూటమి నాయకులకు, అధినేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హితవు పలికారు.

సబ్సిడీ వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ..

విశాలాంధ్ర-కూడేరు : మండలంలోని చోళ సముద్రం గ్రామపంచాయతీ రైతు సేవా కేంద్రంలో మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు సర్పంచ్ వడ్డేరమాదేవి ఆధ్వర్యంలో వేరుశనగ విత్తన కాయలను బుధవారం రైతులకు పంపిణీ చేపట్టారు. ప్రభుత్వం రైతులకు సరైన కార్తీ సమయంలో పంపిణి చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు, రాష్ట్ర ఎన్డీఏ కూటిమి ప్రభుత్వం ప్రియతమ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి పయ్యావుల కేశవ్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రైతులు రైతు సేవ కేంద్ర సిబ్బంది, టీడీపీ నాయకులు వడ్డే రాజు, జెన్నే తిప్పయ్య, ముత్యాలప్ప, పాండు, బోయ విష్ణు, చంద్రబాబు నాయుడు రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన.. కదలివచ్చిన నిరుద్యోగులు

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

విశాలాంధ్ర-శింగనమల : నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గురుకుల పాఠశాల లో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీడప్ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో నియోజకవర్గం నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి యువతీ, యువకులు అధిక సంఖ్యలో హాజరయ్యారని,జాబ్ మేళాలో దాదాపు 50 పైగా కంపెనీలు పాల్గొన్నాయన్నారు.

18000 వేల జీతం నుండి లక్ష రూపాయల జీతం ఆఫర్ చేసే కంపెనీ లు పాల్గొన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దిశగా పెట్టుబడులు పెట్టి కంపెనీలు వస్తున్నాయని కంపెనీ లు రావడంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు సాధించడానికి మెండుగా అవకాశాలు ఉన్నాయన్నారు. వచ్చే నెలలో కూడా జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన యువతీ యువకులకు ఆఫర్ లెటర్ ఎమ్మెల్యే బండారు శ్రావణి చేతుల మీదుగా అందజేశారు.ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఉద్యోగం సాధించిన యువతీ యువకులు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు నిరుత్సాహ పడకుండా ఒక కంపెనీ కాకుంటే మరొక కంపెనీలో ట్రై చేసి ఉద్యోగం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటి మడుగు కేశవరెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా శేషారెడ్డి

విశాలాంధ్ర-నార్పల : మండల కేంద్రంలోని కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బుధవారం శేషారెడ్డి, బాధ్యతలు చేపట్టారు. ఎంపిడిఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించే ఉమాదేవి బదిలీపై జిల్లా పరిషత్ కార్యాలయానికి వెళ్ళగా శెట్టూరు ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా నార్పలకు వచ్చారు. ఎం.పి.డి.ఓ మమత దేవిని కలిసి నార్పల మండల ప్రజాపరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో తోటి సిబ్బంది సహకారంతో కార్యాలయానికి వివిధ పనుల కోసం కార్యాలయనికి వచ్చే వారికి అందుబాటులో ఉంటు మంచి సేవలు అందిస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన జింక పిల్ల

ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన మాజీ ఎంపీపీ రంగయ్య

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో కుక్కల దాడిలో గాయపడ్డ జింక పిల్లను యాడికి మాజీ ఎంపీపీ వేలూరురంగయ్య కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. జింక పిల్లను కాపాడినందుకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, ప్రభాకర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక వేడుకలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా బుధవారం ఏరువాక పౌరణమి రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు ఉదయమే ఎద్దులకు స్నానాలు చేయించి అలంకరణ చేశారు. రైతులు పొలాల్లో పూజలు నిర్వహించారు. శ్రీదరఘట్ట, గోవిందవాడ, ఉంతకల్లు, నేమకల్లు,కురువల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం డప్పు చప్పుళ్ల నడుమ వృషభలను దేవాలయాల చుట్టూ తిప్పించి తర్వాత గ్రామాల్లో సవారీ వదిలారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సవారీలో గెలుపొందిన ఎదుల యజమానులకు బహుమతులు అందించారు.

మొరాయిస్తున్న ఆధార్ సేవలు

విశాలాంధ్ర-నార్పల: మండల పరిధిలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సేవలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 5 సంవత్సరాల లోపు పిల్లలకు కొత్త ఆధార్, బయోమెట్రిక్ అప్డేట్, ఫోటో మార్పిడి, చిరునామా మార్పు, తదితర సేవలను ప్రతిరోజు 20 నుంచి 30 మంది లోపలే ఆధార్ చేపిస్తున్నారు. ఆధార్ సర్వర్ మొరాయిస్తుండడం వల్ల, ఆధార్ సర్వీసులు నెమ్మదించాయని ఆపరేటర్ తెలిపారు. ఆధార్ సర్వర్ వేగవంతంగా పనిచేస్తే ప్రతిరోజు 40 నుంచి 60 మంది వరకు ఆధార్ సర్వీసులు చేయొచ్చని తెలిపారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన విప్ కాలువ

విశాలాంధ్ర-కణేకల్లు : కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు అన్నారు. ఇందులో భాగంగా కణేకల్ గ్రామ నేసేపేటలో సీసీ రోడ్డు రూ.24 లక్షలతో పూర్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కాలువ హాజరై సీసీ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదివరకు వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఏ ఒక్క పని కూడా పూర్తి చేయలేదని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి మండలంలోని పల్లెల్లోను పనులు దగ్గరుండి పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఇది ప్రజల పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్ కాలువతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు అందరూ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి సహకరించండి

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని తేరన్నపల్లి గ్రామంలో బుధవారం ప్రభుత్వ వైద్యాధికారి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో టీబి ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టిబి హెల్త్ సూపర్వైజర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి నూరు రోజుల పాటు మండలంలోని పలు గ్రామాలలో ప్రజలకు క్షయ వ్యాధిపై ప్రత్యేక అవగాహన, గల్ల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరికైనా జలుబు, దగ్గు వచ్చిన రెండు వారాలకు గల్లతో కూడిన దగ్గు ఉన్నచో సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి గళ్ళ పరీక్ష చేయించు కోవాలని ప్రజలకు సూచించారు. అంతేకాకుండా హైరిస్క్ గర్భవతులు పౌష్టికమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కృష్ణమోహన్ బాబు ఏఎన్ఎం సుకుమారి ఎం.ఎల్.హెచ్.పి లక్ష్మి ఆశా

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 12, జూన్ 2025

నేలను, పాడిని పూజించే గొప్ప సాంప్రదాయం మనది

మంత్రి సత్య కుమార్ యాదవ్.

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏరువాక కార్యక్రమాన్ని బుధవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేలను, పాడి పశువులను, యంత్రాలను పూజించుకునే సాంప్రదాయం మన దేశ వ్యవసాయం గొప్పదనమని కొనియాడారు. ఖరీఫ్ 2025 కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం గొట్లూరు గ్రామం సచివాలయం వద్ద ప్రారంభించారు.

ఎస్ ఎం ఏ యం పథకం ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై యంత్ర పరికరాలు సరఫరా చేశామని తెలిపారు. అలాగే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయంలో రైతు ఉత్పత్తి సంఘాల ఆవశ్యకతను వివరించారు. పంట సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి సరైన సమయంలో పురుగు మందులు పిచికారి చేసుకోవడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు పుష్కలంగా కురవాలని రైతులకు మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు , వేరుశనగ సబ్సిడీ వివరాలు తెలియజేయడం జరిగింది అని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అంబటి అరుణశ్రీ ,ఏపీ సీడ్ డైరెక్టర్ కాటమయ్య, ఆర్డీఓ మహేష్ , డిహెచ్ఓ చంద్రశేఖర్, ఏపీఎంఐపి పిడి సుదర్శన్ ఏడిఏ సనావుల్లా, ఏవోలు ముస్తఫా, రమాదేవి, ఓబిరెడ్డి, రవీంద్ర ,ఎంపీడీవో సాయి సాయి మనోహర్, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, బిజెపి మండలాధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ,ఏ ఈ ఓ లు అశ్విని, మురళి, ఉపేంద్ర వీహెచ్ ఏలు చరిత్ ,గీతాంజలి, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం : నియోజకవర్గ అభివృద్దే మా లక్ష్యమని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం ఎన్డీఏ కార్యాలయంలో విద్యుత్, రహదారులు, వైద్య రంగాలపై సమీగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మవరం అభివృద్ధికి శాఖల సమన్వయంతో వేగవంతం చేయాలని తెలిపారు. పల్లె ప్రగతికి రహదారులు, ప్రజా ఆరోగ్యానికి ఆసుపత్రులు, సబ్స్టేషన్లు, సూర్య ఘర్ అతి ముఖ్యమైన వని తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రజలకు న్యాయమైన సౌకర్యాలను అందుబాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్, వైద్యం విషయంలో అధికారులు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల నుండి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటికే మంజూరైన నిధులతో రోడ్ల నిర్మాణాలు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని పాత రోడ్లను అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయాలని ప్రజా రవాణాకు ఎలాంటి ఆటంకం ఉండరాదని అధికారులను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మందుల లభ్యత సిబ్బంది పనితీరును ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవిని ఆరా తీశారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వైద్య భరోసా

సీఎంఆర్ ద్వారా పేద ప్రజలకు వైద్య భరోసా ఎన్డీఏ ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం ఎన్డీఏ కార్యాలయంలో తొమ్మిదిమంది లబ్ధిదారులకు మొత్తం రూ.6,43,618 విలువ గల చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సంబంధిత అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటున్న వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. సమాజంలో నిస్సహాయులైన వారికి అండగా నిలబడడమే సుస్థిర పాలన అందించడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, చెన్నకేశవ స్వామి ఆలయ అడహక్క చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, గిర్రాజు నగేష్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించకుంటే మున్సిపల్ కార్యాలయా దిగ్బంధం

- అర్హులైన కార్మికులకు నూతన ఇళ్ల పట్టాలు ఇవ్వాలి
- అన్యాక్రాంతం చేసిన వారిపై 420 కేసులు నమోదు చేయాలి.
- సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం: వారం రోజుల్లో సర్వేనెంబర్ 650-2లో అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే మున్సిపల్ రెవెన్యూ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని, అర్హులైన కార్మికులకు నూతన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని, అన్యాక్రాంతం చేసిన వారిపై 420 కేసులు నమోదు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవోస్‌లో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఇందులో మధు మాట్లాడుతూ 650-2,సర్వే నెంబర్‌లో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషన్స్ కార్మికులకు అన్యాయం జరిగిందని, అనర్హులైన వారందరికీ పట్టాలు ఇచ్చి అర్హులైన కార్మికుల్ని రోడ్డున పడేయడం దారుణము కాదా? అని వారు ప్రశ్నించారు.గత మూడు నెలలుగా ధర్మవరం పట్టణంలో 650-2,సర్వే నెంబర్ లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను కోరడం తో రెవెన్యూ అధికారులు స్పందించి కార్మికుల దగ్గరకు వచ్చి మీ న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తామని, 650-2 సర్వే నెంబర్ లో అనర్హులైన వారి పట్టాలను రద్దుచేసి, ఎవరైతే నిజమైన కార్మికులు ఉన్నారో వారికి వెంటనే పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మొత్తం 76 పట్టాలను ధర్మవరం ఆర్డీవో రద్దు చేశారు అని, అయినా అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టడం సమంజసమేనా? అని వారు మండిపడ్డారు.ఇప్పటికైనా సరే అధికార యంత్రాంగం స్పందించి అక్రమార్కులపై 420 కేసులు నమోదు చేసి, అక్రమ కట్టడాలను తొలగించి నిజమైన లబ్ధిదారులకి న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషన్స్ కార్మిక సంఘం అధ్యక్షులు గోవిందరాజు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, రామసుబ్బయ్య, రామకృష్ణ, సురేంద్ర, నాగేంద్ర,చిన్న, పీరా, జనార్దన్, మహిళా సమైక్య లీడర్స్ లలితమ్మ,లింగమ్మ, ఈరమ్మ, పాల్గొన్నారు.

రైతులకు పంట పెట్టుబడి సహాయం రూ.20 వేలు అందించాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి డిమాండ్

విశాలాంధ్ర-హిందూపురం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ వెంకటేష్కు, రైతులకు పంట పెట్టుబడి సహాయం 20,000 అందించాలని బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి మాట్లాడుతూ, రైతులకు ఎన్నికల ముందు పంట పెట్టుబడి సహాయం కింద 20,000 వేలు రూపాయలు ప్రతి సంవత్సరం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే సంవత్సరం పూర్తి అయినప్పటికీ ఎక్కడా కూడా ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో పడింది లేదని ఎద్దేవా చేశారు. రైతులకు పంటపెట్టబడి సహాయం అందించేంతవరకు ఉద్యమాల్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాలు విపరీతంగా పడుతున్న పరిస్థితుల్లో రైతులకు పంట పెట్టడానికి సిద్ధంగా ఉన్ననూ, వెంటనే రైతులకు రూ.20 వేలు పంట పెట్టుబడి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ అంటే ఏ అంటే అమరావతి పి అంటే పోలవరం మాత్రమే కాదని, మిగిలిన జిల్లాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనాఉన్నదని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అంజి, నరసింహప్ప, అశ్వత్థప్ప, నాగరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి వికటించి యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర గుడిబండ : మండలంలోని హెచ్.ఆర్.హట్టి గ్రామానికి చెందిన భోజరాజు కుమారుడు కృష్ణమూర్తి(21) బెంగళూరులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. కృష్ణమూర్తి బంధువులు తెలిపిన వివరాలు.. సీసీ గిరి గ్రామానికి చెందిన సౌమ్య(19) కలిసి చదువుకుంటున్న క్రమంలో ప్రేమించుకున్నారు. ఇరువురి కులాలు వేర్వేరు కావడంతో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లికి సౌమ్య తరపున బంధువులు ఒప్పుకోకపోవడంతో గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. చివరకు ఇద్దరు కలిసి బెంగళూరులో కాపురం పెట్టారు. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు.. కానీ బుధవారం తన మృతికి తన భార్య తల్లిదండ్రులు వాళ్ళ మేనమామ కారకులని ఈ విషయంలో తన భార్యకు నా తల్లిదండ్రులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ సూసైడ్ నోట్ రాసి పెట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియల్సి ఉంది.

రాష్ట్ర సుభిక్షమే గరుడసేవ లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం : రాష్ట్ర సుభిక్షమే, ప్రజల ఆరోగ్యమే గరుడసేవ లక్ష్యంతో ప్రతినెల గరుడ సేవ నిర్వహిస్తున్నామని ఆలయ అడహక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సాయంత్రం పున్నమి గరుడసేవను నిర్వహించారు. అనంతరం అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్‌లు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వివిధ పూలమాలలతో అలంకరించిన గరుడ ఉత్సవ విగ్రహానికి, స్వామివారికి వివిధ పూలమాలలతో అలంకరించిన వైనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గరుడ సేవకు దాతగా ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ వ్యవహరించారు. దీంతో ఆలయ ఈవో, అర్చకులు దాతను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక పల్లకిలో పట్టణ పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య సేవా మండలి శిష్యా బృందం, భక్తాదులు, పట్టణ ప్రజలు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో, ముఖ్య అతిథులుగా మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువు బాబు బాలాజీ ఆధ్వర్యంలో 15 మంది శిష్య బృందం యోగా నాట్యమును ప్రదర్శించారు. ఈ నాట్య ప్రదర్శనలో యోగా వల్ల ఉపయోగాలు, పాటలోనే యోగ వివిధ భంగిమలు చేసిన వైనం మంత్రి సత్యకుమార్ యాదవ్, చిలక మధుసూదన్ రెడ్డి,అధికారులతో పాటు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కలెక్టరు, జాయింట్ కలెక్టర్, మంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డితో ప్రశంసలు అందుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను నాట్య రూపంలో ప్రదర్శించడం నిజంగా గర్వించదగ్గ విషయమని.. ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రామలాలిత్యా వారి శిష్య బృందం పాల్గొన్నారు.

పేదలకు కంటి వెలుగును ప్రసాదించడంలో నిజమైన సంతృప్తి..

విశాలాంధ్ర-ధర్మవరం : పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడంలో నిజమైన సంతృప్తి సంతోషం లభిస్తుందని శ్రీ షిరిడి సాయి సేవాసమితి అధ్యక్షులు వీర నారాయణ, ఉపాధ్యక్షులు టి.సి. నారాయణ రెడ్డి, కార్యదర్శి జలదంకి సూర్యనారాయణ, డైరెక్టర్ సూర్య ప్రకాష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పుట్టపర్తి రోడ్, సత్య సాయి నగర్ లో గల షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో ఉచిత కంటి పరీక్షల మెగా వైద్య శిబిరాన్ని షిరిడి సాయిబాబా సేవా సమితి కమిటీ వారు నిర్వహించారు. ఈ శిబిరం శిరిడి సాయిబాబా సేవా సమితి, జిల్లా అంధోత్వ నివారణ సంస్థ - సత్య సాయి జిల్లా, పుష్పగిరి కంటి ఆసుపత్రి - కడప వారి సహాయ సహకారాలతో నిర్వహించారు. అనంతరం సేవా సమితి కమిటీ వారు మాట్లాడుతూ ఈ కంటి శిబిరానికి 150 మంది కంటి రోగులు పాల్గొనగా కంటి వైద్య చికిత్సలను కడప ఆసుపత్రి వైద్యులు నిర్వహించగా 75 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారని తెలిపారు. అంతేకాకుండా షిరిడి సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆలయంలో 150 మందికి అన్నదానం చేస్తున్నామని చెప్పారు. కంటి నిపుణుల సలహాలతో కంటికి ఉచిత లెన్స్ కూడా అమర్చబడుతున్నామని తెలిపారు. ఉచిత వైద్యం, ఉచిత ఆపరేషన్, ఉచిత వసతి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు.చిన్న పిల్లలకు వికలాంగులకు ప్రత్యేక ఉచిత కంటి పరీక్షలను నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు.

గ్రామీణ యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ: గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర బీసీ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనతో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా 25 రకాల చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీ డాప్), సెంచూరియన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై యువతకు అవగాహన సదస్సును స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత, మార్కెట్ ఆధారిత నైపుణ్య కార్యక్రమాలపై శిక్షణ అందజేస్తూ, పల్లెల్లో చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా 25 రకాల పరిశ్రమలను ఏర్పాటు చేయడంపై యువతకు శిక్షణ ఇవ్వడంతో పాటు సబ్సిడీ రుణాలు అందజేయనుందన్నారు. అదే సమయంలో వారు చేసే ఉత్పత్తులకు కూడా ప్రభుత్వమే మార్కెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీడాప్), సెంచూరియన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటు-ఉపాధి అవకాశాల కల్పనపై అవగాహనతో పాటు శిక్షణా కార్యక్రమాలను తమ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పెద్ద ఎత్తున యువత తరలొచ్చిందని ఆనందం వ్యక్తంచేశారు.

20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం... ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు శ్రమిస్తూ... ఏపీలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేలా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలొస్తున్నాయన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో పెనుకొండ నియోజక వర్గానికి ప్రథమ నిలిపేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

మహిళలకు ఎంతో మేలు... ఆయా ప్రాంతాల అవసరాలు, స్థానికంగా లభ్యమయ్యే రా మెటీరియల్లకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుపై ఉత్సాహవంతులైన యువతకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. అవసరమనుకుంటే పంచాయతీ స్థాయిలోనూ ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ శిక్షణా కార్యక్రమాలతో మహిళలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనందరావు, సీడ్ఏపీ స్టేట్ మిషన్ మేనజర్ విజయకుమార్ ,సెంచూరియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్ కుమార్ ఏపీ ఫుడ్ కార్పొరేషన్ జోనల్ ఆఫీసర్ మారుతి, జెడిఎం సూర్యనారాయణ తాసిల్దార్ శ్రీధర్, ఎంపీడీవో నరేష్ కృష్ణ, టీడీపీ నాయకులు కూటమి నాయకులు కన్వీనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళాజ్యోతి నూతన కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని కళాజ్యోతిలో నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశమును ఏర్పాటు చేసుకోగా, ఈ సమావేశంలో కుంటిమల నారాయణను ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడంలో భాగంగా గౌరవ అధ్యక్షులుగా పి. వెంకటనారాయణ, గౌరవ సలహాదారులుగా ఎస్.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జగ్గా వేణుగోపాల్, కార్యదర్శిగా బాలకొండ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా పాగాల అశ్వత్థ నారాయణ, కార్యవర్గ సభ్యులుగా కే.రమేష్ బాబు, గూడూరు మోహన్దాస్, డి.రాంప్రసాద్, జి.పెద్దారెడ్డి, కె.మధుసూదన్, సి.రామన్న, టి.సూర్యనారాయణ రెడ్డి, మాయ కుంట్ల ఆదినారాయణలను ఎన్నుకున్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహం వద్ద విజయోత్సవం

విశాలాంధ్ర-అమరాపురం: అమరాపురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా కేక్ కటింగ్ గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీటీసీలు మాజీ ఎంపీటీసీలు, జడ్పిటిసి,మాజీ జడ్పిటిసిలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మండల తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్స్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, ఆయకట్టు అధ్యక్షులు, డైరెక్టర్లు, డీలర్ సంఘం అధ్యక్షులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సిడిపిఓగా బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ఐసిడియస్ ప్రాజెక్ట్ నూతన సీడీపీఓగా ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు, ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు, ధనలక్ష్మి అనంతపురం రూరల్ మండలం నుంచి పెనుకొండ ఐసిడియస్ ప్రాజెక్ట్ నూతన సీడీపీఓ గా ధనలక్ష్మి ఈరోజు భాద్యతలు స్వీకరించారు ఇటీవల సాధారణ బదిలీ లలో అనంతపురం రూరల్ ఏరియా నుంచి పెనుకొండకు బదిలీ మీద విచ్చేశారు, ఇక్కడ పనిచేస్తున్న సిడిపివో శాంత లక్ష్మి సోమందేపల్లి ఏరియాకు బదిలీ అయ్యారు.

చిలమత్తూరులో రాయితీ వేరుశెనగ విత్తన పంపిణీ..

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల కేంద్రంలో రాయితీ వేరుశెనగ విత్తనములు కొరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులకు బుధవారం విత్తన పంపిణీని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీ ఎగువింటి శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్.సీ. కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ బేకరీ గంగాధర్, మండల కొఆర్డినేటర్ రంగా రెడ్డి,గౌరి శంకర్, అశ్వత్తప్ప చిలమత్తూర్-1 రైతు సేవ కేంద్రం లో రైతులకు రాయితీ వేరుశెనగ విత్తనములు పంపిణీ చేశారు. రైతులు కె-6 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2790/- కాగా, 40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటాగా రూ.1674/- చెల్లించాలన్నారు.

గ్రామస్థాయి కమిటీలతో పార్టీని బలోపేతం చేయండి

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-బత్తలపల్లి: మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేతి వృత్తుదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సీపీఐ పార్టీని బలోపేతం చేసి ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలతో గద్దెనెక్కి సంవత్సరం గడుస్తున్న ఎలాంటి హామీలపై మాట్లాడలేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వీటిపై ఉద్యమాలు తీవ్రతరం చేద్దామని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కుల్లాయప్ప ,మండల కార్యదర్శి వెంకటేష్ ,దళిత హక్కు పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సన్న పెద్దన్న నాగభూషణ తాడిమర్రి మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు గ్రామ బీసీ కాలనీ నివాసం ఉంటున్న వి. శృతి(27), వి.మణికంఠతో ఇప్పటికి సుమారు పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. తన భర్త పెళ్లయిన కొంతకాలం బాగా చూసుకొని సుమారు రెండు సంవత్సరాల నుండి తాను పనికి పోకుండా మద్యానికి బానిసై హింసిస్తున్నాడని.. బాధితురాలి నుంచి రాబడిన ఫిర్యాదు మేరకు కొత్తచెరువు సిఐ మారుతి శంకర్, వారి ఫ్యామిలీకి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా అతనిలో మార్పు రానందున భార్య ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశారు.

గోకులం షెడ్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ ఉమేష్..

విశాలాంధ్ర-అగళి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్ను బుధవారం జెడ్పిటిసి ఉమేష్ మండల పార్టీ కన్వీనర్ కుమార్ స్వామి ఎంపీపీ రేణుక కామరాజు ప్రారంభించారు. మండల కేంద్రమైన అగళిలో మల్లికార్జున అనే రైతు ఉపాధి హామీ పథకం కింద 2:30 లక్షల వ్యయం తో నిర్మించిన గోకుల షెడ్డును ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు ప్రారంభించారు. పాడి రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం గోకులం షెడ్‌లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజునాథ్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివరామప్ప మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, మాజీ ఎంపీపీ నరసింహప్ప, నాయకులు రాజగోపాల్, కసాపురం శివన్న, టెక్నికల్ అసిస్టెంట్లు దేవగిరి, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రంగనాథ్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి

విశాలాంధ్ర-ఓడిసి రూరల్: సీజనల్ వారీగా ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులు మొగ్గు చూపితే అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు రైతులకు తెలిపారు. బుధవారం ఓబులదేవరచెరువు, కొండకమర్ల గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల నందు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్నీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు గల పంటలు సాగు చేసేందుకు రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు, వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం పంటలు సాగు చేస్తే ఎకరాకు 5 నుండి 6 కింటల్లా దిగుబడి వస్తుందన్నారు, అలాగే పండ్ల తోటల పెంపకంపై సలహాలు, సూచనలు రైతులకు అందించారు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల పథకాలు గురించి వివరించారు, కార్యక్రమంలో శాస్త్రవేత్తలు,మాధవి హార్టికల్చర్ శాస్త్రవేత్త, మురుగన్ (భారతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం హైద్రాబాద్, ఏ డి ఏ సెరికల్చర్ శివరామ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ మహమ్మద్,ఉద్యాన అధికారి లావణ్య, సిరికల్చర్ అధికారి మస్తాన్, ఆత్మ సిబ్బంది మౌనిక, రైతు సేవ కేంద్రం సిబ్బంది లలిత, వరలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర-కొత్తచెరువు: స్థానిక బీసీ కాలనీ గంగమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న సాయినాథ పెద్ద కుమార్తె సాయి లక్ష్మి, గత నెల 12వ తేదీ సంగమేశ్వర రథోత్సవానికి విచ్చేసి అక్కడ అదృశ్యమైందని, కొత్తచెరువు సిఐ మారుతి శంకర్, తెలిపారు. బత్తలపల్లి మండలం వెంకట గారి పల్లి గ్రామానికి చెందిన హరితో వివాహం నిర్వహించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె అప్పటినుండి ఎక్కడ వెతికిన కూడా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక తురకల పట్నం రైతు సేవా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి నివేదిత సిబ్బంది సీనియర్ తెలుగుదేశం నాయకులు రామకృష్ణప్ప మాధవ నాయుడు కన్వీనర్ నరహరి చంద్రమౌళి టైలర్ ఆంజనేయులు మాజీ జెడ్పిటిసి చిన్నపయ్య శ్రీనాథ్ వీరాంజనేయులు చెన్నకేశవులు చిరంజీవి ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశెనగ అందజేశారు వ్యవసాయ అధికారి నివేదిత మాట్లాడుతూ మండలానికి 879 క్వింటాలు మంజూరు అయ్యాయని, మండలంలోని ప్రతి రైతు సేవ కేంద్రలో పంపిణీ చేస్తున్నామని, అవసరమైన రైతులు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 12, జూన్ 2025

యోగాతోనే ఆరోగ్య రక్షణ సాధ్యం

విశాలాంధ్ర - ధర్మవరం : యోగాతోనే జీవిత విధానమును అలవర్చుకోవాలని యోగాతోనే ఆరోగ్య రక్షణ లభిస్తుందని ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితర అధికార, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ యోగా కార్యక్రమానికి అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దాదాపు 5,000 మంది పాల్గొన్నారు. వారందరికీ యోగ అభ్యసనలు చేయించారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ యోగా ఆవశ్యకతను చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందని ప్రతి ఒక్కరూ యోగాను జీవిత విధానంగా అలవర్చుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని తెలిపారు. తదుపరి మంత్రి మాట్లాడుతూ యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం జిల్లాలోని అనేక ప్రాంతాలలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఈనెల జూన్ 21 నాటికి కనీసం 2 కోట్ల మందికి యోగాసనాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు రెండు కోట్ల 25లక్షల మంది దాకా రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామం పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలను జరుగుతున్నందున ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమాల్లో పాల్గొని విజయంతం చేయాలని మంత్రి కోరారు. అనంతరం కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అందరిలోన యోగా దినోత్సవం లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ నేటి సమాజంలో యోగ ఎంతో అవసరమని, మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతమైన మనశ్శాంతిని యోగా మాత్రమే ఇస్తుందని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా యోగాను అలవాటు చేయడం జరిగిందని తెలిపారు. తదుపరి ధర్మవరం నకు చెందిన బాపు బాలాజీ శ్రీ లలిత నాట్య మండలి లో చిన్నారులు ప్రదర్శించిన యోగా సాంస్కృతిక నాట్య కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వందలాది మంది భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహిళా నాయకురాలు జయశ్రీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ అంబటి అరుణశ్రీ, ఆర్డీవో మహేష్ ,డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్, పర్యటక శాఖ మేనేజర్ ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ జిల్లా అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ,సామాజిక సేవా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ,విద్యార్థులు చిన్నారులు మహిళలు , పోలీసు, ఉద్యోగ సిబ్బంది యోగ శిక్షకులు, దాకా యోగ ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు సైడ్ కాలువలుకు భూమి పూజ

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో వివిధ కాలనీలో సిసి రోడ్లు, సైడ్ కాలువలు, మున్సిపల్ ఆఫీస్‌లో చెత్త తీసుకురావడానికి రెండు ట్రాక్టర్లుకు భూమి పూజ, ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, గుంతకల్ మండలం ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి హాజరై, రెండు కోట్ల 21లక్షలు రూపాయలతో గుంతకల్ మండలంలో పలుచోట్ల అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, భూమి పూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో 35వ వార్డు పోర్ట లైన్ వద్ద పది లక్షల రూపాయలతో డ్రైనేజీ నిర్మాణం, 26 వార్డు హౌసింగ్ బోర్డు బురుగులు బట్టి వద్ద పది లక్షల రూపాయలు డ్రైనేజీ కాలు నిర్మాణం కొరకు, మూడో వార్డు పాత కలవరి టెంపుల్ గుత్తి రోడ్డు ఏరియాలో పది లక్షల రూపాయలతో డ్రైనేజీ కాలు నిర్మాణం కొరకు, నాలుగో వార్డ్ ఫ్యాక్టరీ ఫ్యాక్టరీ ఎదురుగా 10లక్షల రూపాయలతో డ్రైనేజీ కాలువ నిర్మాణం కొరకు భూమి పూజ చేయడం జరిగింది.మున్సిపల్ కార్యాలయం వద్ద 23లక్షల రూపాయలతో రెండు నూతన మున్సిపల్ ట్రాక్టర్లు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఉంటేనే గ్రామాల్లో, పట్టణాల్లో అయితేనేమి అభివృద్ధి బాటలో ఉంటాయని కొనియాడారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు బందారు ఆనంద్, మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, లాయర్ కృష్ణ రెడ్డి, గుజిరి కాజా, టిడిపి నాయకులు, మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్లకు భూమి పూజ

విశాలాంధ్ర-యాడికి: మండలం పరిధిలోని పెద్ద పేట గ్రామంలో బుధవారం ఫారం పాండ్లకు బుధవారం ఎంపీడీవో వీర్రాజు భూమి పూజ చేశారు. వేములపాడు గ్రామంలో పశువుల నీటి తొట్టెలు ఎంపీడీవో వీర్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనీటి తొట్టెలు మూగజీవాల దాహం తీర్చ డానికి ఉపయోగపడుతాయన్నారు. రామచంద్ర రెడ్డి సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆటల దినోత్సవం

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని కోడపగాని పల్లి గ్రామంలో అంతర్జాతీయ ఆటల దినోత్సవాన్ని పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు వివిధ రకాల ఉత్సాహ పోటీలను నిర్వహించారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదివేతట్ల తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని పాటల ద్వారా వారు సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మహేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, అంగనవాడి వర్కర్ పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని అవగాహన

విశాలాంధ్ర - హిందూపురం: హిందూపురం రూరల్ పరిధిలోని తుమకుంట గ్రామంలోని వీధులలో బుధవారం ఇంటి యజమానులకు తడి చెత్త, పొడిచెత్త వేరు చేసి పంచాయతీ క్లాప్ మిత్ర వారికి ఇవ్వాలని, మైక్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రత్నమ్మ చిన్న వీరప్ప, పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప తోపాటు ఫీల్డ్ అసిస్టెంట్, క్లాప్ మిత్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి విజయోత్సవ ర్యాలీని విజయప్రదం చేయండి

విశాలాంధ్ర - అగళి : కుటుంబ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు గురువారం మండల కేంద్రంలో నిర్వహించే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని జడ్పిటిసి ఉమేస్స్ కన్వీనర్ కుమార్ స్వామి పిలుపునిచ్చారు.మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం ఉదయం 11గంటలకు అగళి మండలకేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం నిర్వహించే ర్యాలీలో., మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు మాజీ సర్పంచులు, పార్టీ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, ఆయకట్టు అధ్యక్షులు, డైరెక్టర్లు, డీలర్లు, పార్టీ అనుబంధ సభ్యులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలోని భువన విజయము

సమావేశ భవనము నందు బుధవారం ఆర్డీఓ ఆనంద్ కుమార్ అధ్యక్షతన డివిజన్ స్థాయి అధికారుల సమా వేశం ఏర్పాటు చేసి 16వ తేదీన యోగేంద్ర 2025 కియా పరిశ్రమ ఆవరణ నందు జిల్లా యోగేంద్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి పంచాయితీ స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు డివిజన స్థాయి అధికారులు వ్యాపారస్తులు ఉపాధ్యాయ యూనియన్ నాయకులు ఉపాధ్యాయులు వ్యాపారవేత్తలు అందరూ హాజరై యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు అధికారులతో చర్చలు నిర్వహించారు, కియా పరిశ్రమ ఆవరణ నందు నిర్వహిస్తున్న యోగాంధ్ర పారిశ్రామికవేత్తలు కూడా విచ్చేస్తారని ఆర్డీవో తెలిపారు, ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలోని భాగ్యనగర్ నివాస శ్రీధర్ డయాలసిస్ పేషెంట్.. ఇతను వైద్యం చేయించుకోవాలని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా బెడ్ ఖాళీ లేదని.. ఇంకో వారమో రెండు వారాల వరకు ఈ ఆసుపత్రిలో చేర్చుకుని వైద్యం చేయడం వీలు కాదని సంబంధిత డాక్టర్ చెపారు. కర్నూల్‌లో కానీ అనంతపురంలో గానీ అప్పటి వరకు ట్రీట్మెంట్ తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అనంతపూర్ కర్నూల్ వెళ్లి డయాలసిస్ ట్రీట్మెంట్ తీసుకోవడానికి ఆర్థిక పరమైన ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని వారు అనంతపురం వెళ్లి వైద్యం చేయించుకుని రావడం కోసం 32వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వై. సుధాకర్ వారికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

ఆర్డీటీని పరిరక్షించాలని ఉరవకొండలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లాలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించిన ఆర్డిటి స్వచ్ఛంద సంస్థను పరిరక్షించాలని కోరుతూ ఈనెల 19వ తేదీన ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఉరవకొండలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక రోడ్లు భవనాల అత్యధిక గృహంలో ర్యాలీకి సంబంధి ంచిన పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మీనుగా గోపాల్, చాబాల గ్రామ సర్పంచ్ జగదీష్, కు దేరు సూరి తదితరులు మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ 1969లో ఆర్డిటిని స్థాపించి బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ వారి అభివృద్ధిని కాంక్షించి ఉచిత విద్య, వైద్యం,గృహ నిర్మాణం,పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాటర్ షెడ్డు నిర్మాణాలు, వికలాంగుల అభివృద్ధి కోసం స్పెషల్ స్కూల్ ఏర్పాటు చేసి, ప్రతి గ్రామానికి బడులు నిర్మించి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. అటువంటి ఆర్ డి టి ఇప్పుడు కష్టాల్లో పడిందని దానిని మనమందరం కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కేంద్ర ప్రభుత్వం విదేశీ ఫండ్స్ రానీయకుండా ఎఫ్ సి ఆర్ ఏ ను నిలుపుదల చేయడం చాలా బాధాకరమన్నారు. ఆర్డిటి ద్వారా లబ్ది పొందిన ప్రతి కుటుంబం సభ్యులు 19న జరిగే భారీ ర్యాలీకి తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. దళిత సంఘం నాయకులు పాల్తూరు ఆనంద్ రాజు, బెంజిమాన్, లత్తవరం చంద్రశేఖర్, లాల్ ప్రసాద్, రేణుమాకుల పల్లి రమేష్, రాజశేఖర్, యల్లన్న, సోమశేఖర్, రాజేష్, ప్రసాద్ నాయక్, పృథ్వి, గణేష్, నింబగల్ రాము, మీనుగా రామాంజినేయులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో రూములకు భూమి పూజ

విశాలాంధ్ర-గుంతకల్లు: కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం లో ఈరోజు పత్తికొండ గ్రామస్తులు మెండే పుల్లయ్య , సరోజినీ దంపతులు కుటుంబ సభ్యులకు అర్చకులు రాకేష్ స్వామి ,స్వామి అమ్మవార్లకు కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుల్లయ్య కుటుంబ సభ్యులకు శాలవాలతో సన్మానం చేస్తూ స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ దేవస్థానం వారు నిర్వహించే భక్తులకు స్వాములకు విడిది సౌకర్యాల కోసం ఒక్క రూముకు ఆరు లక్షల రూపాయలు స్వామి అమ్మవారి ఆశీస్సులతో మేము మా కుటుంబం నిర్ణయించుకోవడం స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం అవకాశం మాకు కలిగినందుకు చాలా సంతోషంగా ఆనందంగా ఉందని మా నుండి ఇంకా కొంతమంది భక్తులను స్వామివారి సేవకు వస్తారని అందరూ ఉన్న దానిలో దైవ సేవలో కొంత అయినా సేవ చేస్తే భగవంతుడు మనకు దీనికి పది రెట్లు ఎక్కువ ఇస్తాడని ధర్మో రక్షిత రక్షిత: అన్నారు. ఆలయ ధర్మకర్త తలారి పరశురాముడు మాట్లాడుతూ స్వామి అమ్మ వారి ఆశీస్సులతో శ్రావణమాసంలోవైకుంఠ సుఖ దామం రూములకు భూమి పూజ జరుగు ఈ కార్యక్రమానికి భక్తులను అన్ని కుల సంఘాల నాయకులను ఆహ్వానించి ఒక్కొక్క సంఘం లోని సభ్యులందరూ కలిసి 6 లక్షల రూపాయలు చెల్లించిన వారికి ఒక్కొ సంఘానికి ఒక్క రూము చిరస్థాయిగా కుల సంఘం పేరున గుర్తుండేలా శిలా పథకం ఏర్పాటు చేయబడును,వారు వారి కుల సంఘంలో ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు దైవ సేవలోభాగస్వాములు కావాలని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి దివ్య ఆశీస్సులుఅష్ట ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలుగుతాయి అందరూ పెద్ద మనసుతో సహకరిస్తారని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రచార కార్యదర్శి సుధాకర్ రిటైర్డ్ రైల్వే స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ఓం శాంతి ప్రసాద్ ,శశివర్ధన్, మురళి ,నారాయణ భక్తులు పాల్గొన్నారు.

రూపా నాయక్ తండాను అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : వజ్రకరూరు మండలం రూపానాయక్ తండ గ్రామాన్ని అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి చేయాలని బంజారా సేవా సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు ఎస్ కే కేశవ నాయక్ తెలిపారు. బుధవారం రూపా నాయక్ తండా గ్రామపంచాయతీ లో ధర్తీయ జన జాగృతి ఉత్కర్ష అభియాన్ జిల్లాస్థాయి అధికారుల సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు, డిఎల్ పిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ నరేష్ ఎంపీడీవో శివాజీ రెడ్డి, వైద్యాధికారి నజీర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సంఘం నాయకులు కేశవ నాయక్ తో పాటు గ్రామ సర్పంచ్ శివాజీ నాయక్, నంగరేర్ నాయక్, ఎస్ కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రూపా నాయక్ తండాను రెవెన్యూ గ్రామముగా ఏర్పాటు చేయాలని పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామాభివృద్ధికి పాటుపడాలని అధికారులను కోరారు. అలాగే అటవీ భూమి సాగు చేసుకుంటున్నా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తండాలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని టూరిజం శాఖ సహాయముతో బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సామా సంగ్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో కళ్యాణమండపం నిర్మించాలన్నారు. తండాలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, విద్యుత్ సౌకర్యం, రోడ్లు, తాగునీరు గిరిజన విద్యార్థులకు కార్పోరేట్ విద్య, వైద్యం సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తులసీదాసు నాయక్ తో పాటు గ్రామస్తులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాగును ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-కణేకల్లు: ఆది సద్గురువు చంద్రశేఖర్ రెడ్డి బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో కనేకల్ మండలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ సాగును ప్రారంభిస్తున్న రైతులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ కణేకల్ మండలం రైతులతో కలిసి ఏరువాక పౌర్ణమి వ్యవసాయ సాగును బుధవారం రోజున రైతులు ఏరువాక సాగు నుండి, పంటలు పండి,రైతులుగిట్టుబాటు ధరలతోసుఖ సంతోషాలుతో ఉండాలని, రైతులు మరింత ఉత్సాహంగా వ్యవసాయముసాగు చేయాలంటే ఎద్దులను , ట్రాక్టర్లను, వ్యవసాయ పనిముట్లను, సబ్సీడీతో రైతులకుఅందిస్తే,వ్యవసాయ రంగము అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. ప్రభుత్వం తరపున రైతులకు, కౌలు రైతులకు సబ్సిడీతో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక అభివృద్ధి పంటలువేసేనాట్లు, కోతల నూర్పుడి యంత్రాలు ,మైక్రో ఇరిగేషన్ పరికరాల కోసం 75శాతం రాయితీని రైతులకు అందించాలన్నారు. రైతులుకు అవసరమైన పెట్రోల్ డీజిల్ 50 శాతం సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని , రైతులకు కౌలు రైతులకు వడ్డీ లేకుండా 3 లక్షల రూపాయల వరకు రుణం అందించాలన్నారు, అదేవిధంగా 5 లక్షల వరకు పావలా వడ్డీ పై రుణం రైతులకు అందించి, ఆర్.బి ఐనిబంధన ప్రకారం ఒక లక్ష 60వేల రూపాయలు కౌలురైతులకు అందించాలి , డిమాండ్ చేశారు రైతాంగానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సూక్ష్మ పోషకాలు 90 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని, ఉపాధీహామీపథకాన్ని వ్యవసాయా నికి అనుసంధానం చేయాలి సాగు ప్రణాళికలతో పాటు అన్ని పంటలకు లాభదాయక ధరలు నిర్ణయించి ప్రకటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎటువంటి షరతులు లేకుండా రుణాలను అందించాలని, పాడిపశువులకు గొర్రెలకు మేకలు కూడా విరివిగా రుణాలుఇవ్వాలి, ప్రకృతి వ్యవసాయ రంగమునకు నిధులు విరివిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆది సద్గురు చంద్రశేఖర్ రెడ్డి వారి బ్రదర్స్ పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టిని ప్రారంభించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ మండలం రేణిమాకులపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో 32 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన పశువుల నీటితోటిని బుధవారం ఉరవకొండ ఎంపీడీవో రవి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవులకు ఈ నీటి తొట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఓ విముల, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

కంపోస్ట్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నాడప్ కంపోస్ట్ పిట్ట నిర్మాణా నికి బుధవారం ఉరవకొండ ఎంపీడీవో రవి ప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను కంపోస్ట్ పిట్టిలో నిల్వచేసి పొలాలకు ఎరువులుగా వాడుకునేందుకు ఇది ఎంత గానో ఉపయోగపడుతుందని వీటిని గ్రామములో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుదగవి గ్రామంలో ఆరు నాడెపు పిట్స్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో పిట్స్ నిర్మాణానికి 18750 రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. గ్రామంలో రెండు పశువులతోట్లు నిర్మాణాన్ని కూడా ఉపాధి హామీ కింద నిధులు మంజూరు అయ్యాయని ఒక్కో పశువుల తొట్టికి 32 వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో విమల, గ్రామ కార్యదర్శి, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మంజూరు చేయండి

విశాలాంధ్ర- శింగనమల: నియోజకవర్గ కేంద్రమైన శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ బైపీసీ గ్రూపులు లేక నిరుపేద విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక తీవ్రఇబ్బందులు పడుతున్నారు, తద్వారా చదువులు కూడా మానేస్తున్నారు. శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ట్స్ గ్రూపులు హెచ్ ఈ సి.సిఈసి, లు మాత్రమే ఉన్నందున సైన్స్ గ్రూపులు చదవాలని ఆకాంక్ష ఉన్న విద్యార్థులు నిరుత్సాహంతో సైన్స్ గ్రూపులపై చదువుకోవాలని శ్రద్ధ ఉన్న విద్యార్థులందరూ ఇష్టం లేని ఆర్ట్స్ గ్రూపులలో చేరాల్సి వస్తోందని ఇష్టం లేని వారు చదువులు మానేసి ఇంటి దగ్గర ఉంటున్నారని, విద్యార్థులకు ఇష్టమైన గ్రూపులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లేనందున విద్యార్థుల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ట్స్ గ్రూపులతో పాటు సైన్స్ గ్రూపులు, ఒకేషనల్ కోర్సులు, కూడా ఏర్పాటు చేసి విద్యార్థుల చదువులకు అనుగుణంగా అధ్యాపకులను నియమించాలని, అందుకు అనుగుణంగా అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

మేఐహెల్ప్‌యూ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

విశాలాంధ్ర-యాడికి: పెద్దపప్పూరు గ్రామంలో చిన్నచిన్న హమాలీ పనులు చేసుకుంటూ తలారి సిద్ధప్ప జీవిస్తుండేవాడు. మంగళవారం ఉదయం ఆరోగ్యం విషమించడంతో ఆయన మరణించారు. తలారి సిద్ధప్పకు భార్య కానీ బంధువులు కానీ ఎవరు లేరు. దీంతో పంచాయతీ కార్యదర్శి గంగా మహేశ్వర్ రెడ్డికి విఆర్ఓ సుంకన్నకు స్థానికులు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న యాడికి మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులు స్పందించి సిద్ధప్ప అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ యాడికి ప్రెసిడెంట్ బందారు బాలకృష్ణ, గౌరవాధ్యక్షులు చందగాని ధృవ నారాయణ, సెక్రటరీ ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, సాకరే శంకరప్ప, పెద్దపప్పూరు పంచాయతీ కార్యదర్శి గంగ మహేశ్వరరెడ్డి, వీఆర్వో సుంకన్న, కానిస్టేబుల్ ఉమాశంకర్, సర్పంచ్ ఓబులమ్మ కుమారుడు గంగన్న, పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ ఎక్కడ..?

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల మండల పరిధిలోని, పెరవలి, తరిమెల, సలకం చెరువు , ఆకులేడు, మండల కేంద్రం శింగనమలలో 33 /11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి, వీటి నిర్వహణ విద్యుత్ ఏఈ లేక రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, వర్షాలకు ఈదురు గాలులకు కరెంటు పోతే ఏ అధికారిని ఏమని అడగాలో తెలియక రైతులు ప్రజలు తికమక పడుతున్నారు,శింగనమల మండల కేంద్రంలోచినుకు పడితే చీకటి మయమవుతూ, మండల కేంద్రంలోనే లైన్మెన్ , ఏ ఈ, లేక రైతులు, ప్రజలు, తమ సమస్యలను ఏ అధికారికి చెప్పుకోవాలో ఎవరు తీరుస్తారోనని, అంతు చిక్కని పరిస్థితుల్లో ఉన్నామని, ట్రాన్స్ఫార్మర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్, స్తంభాలు, వైర్లు, కావలసిన రైతులము ఆఫీసు చుట్టూ కాళ్లరిగేలా తిరిగి తిరిగి వెళుతున్నామని మా బాధలు మా గాధలు ఏ అధికారితో చెబితే తీరుతాయోనని ఆందోళన చెందుతున్నామన్నారు, ఇప్పటికైనాపై స్థాయి అధికారులు స్పందించి శింగనమల మండల కేంద్రానికి విద్యుత్ ఏఈని లైన్‌మెన్‌ను నియమించాలని రైతులుప్రజలు కోరుతున్నారు.